గంజాయి నియంత్రణకు సహకరించాలి

- భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే
- ఆరు కిలోల గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు

మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, జూలై 13 : గంజాయి నియంత్రణకు ప్రజలు సహకరించాలని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లాలో శనివారం ఆరో కిలోల గంజాయిని పట్టుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలో గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు శనివారం ఉదయం 7 గంటలకు గణపురం ఎస్సై సాంబమూర్తి తన సిబ్బందితో కలిసి గాంధీనగర్ క్రాస్ రోడ్ వద్దకు వెళ్లి వాహనాల తనిఖీ చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో కనిపించారు. వారిని కస్టడీలోకి తీసుకొని విచారించగా వారి వద్ద అర కిలో గంజాయి దొరికింది. తర్వాత వారు కిరాయికి ఉంటున్న గదికి వెళ్లి తనిఖీ చేయగా ఐదున్నర కేజీల గంజాయితోపాటు మరో నిందితుడు దొరికాడు. వీరిని బీహార్‌కు చెందిన గణేశ్ ఠాకుర్ (47), మింటు కుమార్(26), చందన్ పాశ్వాన్(33)గా గుర్తించారు. వీరు దాదాపు ఆరు నెలల క్రితం చెల్పూర్‌లోని రైస్ మిల్లులో పని కోసం వచ్చి, జల్సాలకు అలవాటు పడి, డబ్బుల కోసం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రదీప్‌ను కలిసి, అతడి వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ ఇక్కడకు తీసుకువచ్చి ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారు. కాగా, ప్రదీప్ పరారీలో ఉన్నాడు. ఆరు కేజీల గంజాయి పట్టుకోవడంలో కృషిచేసిన భూపాలపల్లి డీఎస్పీ ఏ సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేశ్, గణపురం ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది నేతాజీ, శ్రీనివాస్‌ను ఎస్పీ అభినందించి, రివార్డు ప్రకటించారు.

ప్రేమోన్మాదిని ఉరితీయాలి

మాట్లాడుతున్న గోవిందనాయక్

ములుగురూరల్, జూలై 13 : వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారు చింతలతండాలో దారుణ హత్యాకాండకు పాల్పడిన ప్రేమోన్మాది మేకల నాగరాజుకు ఉరిశిక్ష వేయాలని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొరిక గోవిందనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో బంజారా నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామానికి చెందిన బానోత్ శ్రీనివాస్, సుగుణ దంపతుల కుమార్తె దీపికను ఆటో డ్రైవర్ నాగరాజు ప్రేమపేరుతో కులాంతర వివాహం చేసుకొని ఉన్మాదిగా మారి దారుణంగా దీపిక తల్లిదండ్రులను హతమార్చడంతో పాటు దీపికను ఆమె సోదరుడిని సైతం గాయపర్చాడన్నారు. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించాలని కోరారు. లేకుంటే రాష్ట్రంలో ఉన్న బంజారా కులస్తులమంతా ఏకమై దశల వారీగా ఉద్యమ కార్యాచరణను చేపడుతామని హెచ్చరించారు. పాలకుర్తి ఎమ్మెల్యే పీఏతో పాటు ఎస్సై గిరిజన యువకుడిపై చేసిన దాడిని సైతం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎస్సైతో పాటు పీఏపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. రెండు సంఘటనల్లో బంజారా కులానికి చెందిన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తీరని అన్యాయం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో బంజారా ఐక్య వేదిక నాయకులు పోరిక మోహన్‌లాల్, భూక్యా సోమానాయక్, జర్పుల బాలు, పోరిక సర్వన్‌నాయక్, పోరిక జయరామ్, ఆంగోత్ రాజునాయక్, రాందేవ్, సారయ్య, వినాయక్, సునిల్‌కుమార్, శంకర్, రఘురాం, సమ్మయ్య, రమేశ్, రవి, శ్రీనివాస్, చందూలాల్, రవి, సర్దార్, రమేశ్, స్వామిదాస్, రాహుల్, తిరుపతి, రతన్‌సింగ్, బాలాజీ, దేవ్‌సింగ్, మనోజ్, విజేందర్, కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ములుగురూరల్, జూలై 13 : మండలంలోని కాసిందేవిపేటకు చెందిన గుండాల రవి, కే మల్లయ్య, మదనపల్లికి చెందిన బల్గూరి సత్య ఇటీవల మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ నాయకుడు సుధీర్‌యాదవ్, నాయకులు స్వామిరావు, రామారావు, అమర్ సింగ్, బాబు, భాస్కర్, అంకూస్, నర్సయ్య ఉన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

- రోడ్డెక్కిన డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో ఆందోళన

నీటి సమస్యను పరిష్కరించాలని ఖాళీబిందెలతో ఆందోళన చేస్తున్న డబుల్‌బెడ్‌రూమ్ కాలనీవాసులు

కృష్ణకాలనీ, జూలై 13 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు వేశాలపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసులకు ఆరు నెలలుగా తాగునీరు సరిగా రావడం లేదు. తమను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, తాగునీరు అందించాలని డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ వాసులు శనివారం రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు లక్ష్మి, మాధవి, సుజాత మాట్లాడుతూ వేశాలపల్లిలోని 544 డబుల్‌బెడ్ రూమ్‌లకు మిషన్ భగీరథ అధికారులు ఒక్క సంపు మాత్రమే కట్టించారన్నారు. దాని నుంచి పైపులైన్ వేసి తాగునీటిని సరఫరా చేయడానికి 5 హెచ్‌పీ మోటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే, ఆ మోటర్లు నడవడానికి 15 కేవీ ట్రాన్స్‌ఫార్మార్ ఏర్పాటు చేయాల్సి ఉందని, వాటిని ఏర్పాటు చేయకపోవడంతో మోటర్లు సరిగా నడవడం లేదని తెలిపారు. దీంతో పైపులైన్ ద్వారా వచ్చే నీరు పైఅంతస్తులో ఉంటున్న తమకు అందడం లేదని, దీంతో తాగునీటి కోసం అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మోటర్లకు 15 కేవీ ట్రాన్స్‌ఫార్మార్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో సైతం నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ప్రస్తుతం ఉన్న పైపులైన్ నుంచి మురుగు నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులకు ఎన్నోసార్లు వినతిపత్రాలిచ్చి, మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లల్లో నివసిస్తున్న ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు.

కూలిన సెప్టిక్ ట్యాంక్ గోడ

డబుల్ బెడ్ రూంల పక్కన అమర్చిన సెప్టిక్ ట్యాంక్ గోడ పూర్తిగా కూలిపోయిందని, దీంతో ట్యాంక్‌లోని నీళ్లు బయటకు వచ్చి దుర్వాసన వస్తోందని స్తానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టిక్ ట్యాంకు నీరు మురుగు కాల్వల ద్వారా బయటకు వెళ్లేందుకు వెంటనే మోరీలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

పత్తాలేని పారిశుధ్య పనులు

డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ ఏర్పడిన నుంచి ఇక్కడ పారిశుధ్య పనులు జరుగడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో మున్సిపల్ కార్మికులు ఏ రోజూ రోడ్లను శుభ్రం చేయలేదని, ఇండ్లల్లోని చెత్తను కూడా తీసకెళ్లలేదని తెలిపారు. రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోదని, కాలనీ చు ట్టూ గడ్డి మొలిచి, పరిసరాలు అపరిశుభ్రంగా మారాయన్నారు. దీంతో ఇండ్లలోకి పాములు, తేళ్లు వంటి విషపురుగులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నెలకొక్కసారి మురికి కాల్వలు తీస్తున్నారన్నారు. దీనిపై అధికారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోడం లేదని, శానిటేషన్ అధికారులు కాలనీవైపు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, ప్రజలకు నిర్మించిన కమ్యూనిటీహాల్ వెనుకాల నుంచి వేసిన రోడ్డు ఇంకా అసంపూర్తిగానే ఉందని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

డాంబర్ రోడ్డు నిర్మించాలి

డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే రోడ్డు సరిగా లేదని, వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోని భాస్కర్‌గడ్డ పోచమ్మ తల్లి టెంపుల్ నుంచి డబుల్ బెడ్‌రూమ్ క్రాస్ వరకు సుమారు అరకిలో మీటర్ డాంబర్ రోడ్డు నిర్మించి, రోడ్డు పొడవునా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కాలనీ వాసులు మౌనిక, స్రవంతి, భాగ్య, గంగతో పాటు మరో 100 మంది కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై పవన్ కుమార్

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

మహదేవపూర్, జూలై 13 : మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై పవన్ కుమార్ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని బెగ్లూర్ గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు చేశారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిషేధిత గంజాయి, గుట్కా, గుడుంబా విక్రయించవద్దని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి మరమ్మతులు

'నమస్తే' ఎఫెక్ట్

మహదేవపూర్, జూలై 13 : మండల కేంద్రంలో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రహదారి పక్కన ప్రమాదకరంగా వంగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు శనివారం సిబ్బందితో కలిసి సరిచేశారు. ఈ నెల 6న 'వంగిన విద్యుత్ స్తంభం' శీర్షికన 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో కథనం ప్రచురితం కాగా, స్పందించిన అధికారులు ప్రమాదకరంగా ఉన్న ఆ విద్యుత్ స్తంభాన్ని యంత్రాల సాయంతో సరి చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

మరో యాద్రాద్రిగా కొడవటంచ

- లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మహర్దశ
- రూ.12.15కోట్లతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

రేగొండ, జూలై 13 : తెలంగాణలో మరో యాద్రాద్రిగా కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యానారాయణరావు అన్నారు. మండలంలోని కొడవటంచ గ్రామం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల ఇలవేల్పు లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు రూ.12.15కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏడాదిలో పనులు పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా కొడవటంచ లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చానట్లు గుర్తుచేశారు. ఈ మేరకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టి, మరో యాద్రాద్రిగా గుర్తింపు తీసుకు వస్తామన్నారు. అలాగే, ఘనపురం మండలం బుద్దారం నుంచి కొడవటంచకు రూ.59 కోట్లతో డబుల్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వీటికి కూడా త్వరలోనే నిధులు మంజురు చేయిస్తానన్నారు. ఆయన వెంట ఆలయ మాజీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఎన్ఎస్ఆర్ సంస్థల ఆధినేత నాయినేని సంపత్‌రావు, గుంటోజు కిష్టయ్య, ఇప్పకాయల నర్సయ్య, మ్యకల భిక్షపతి, పట్టెం శంకర్, పబ్బ శ్రీనివాస్ ఉన్నారు.

ములుగులో పీరీలను అడ్డుకున్న ముస్లింలు

హిందువులు ఎత్తుకోవద్దని బెదిరింపులు

సమస్యను వివరిస్తున్న జంగాలపల్లి, ఇంచర్ల, వెంకటాపూర్ గ్రామస్తులు

ములుగు, జూలై13(నమస్తేతెలంగాణ) : సర్వమతాల సమ్మేళనమైన పీరీల పండుగ సందర్భంగా కొందరు హిందువులు పీరీలను ఎత్తుకొని తిరుగుతుండగా వారిని ముస్లింలు అడ్డుకున్నారు. ఈ సంఘటన ములుగు జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇరు వర్గాల నడుమ ఘర్షణ వాతావరణం నెలకొనక ముందే పోలీసులు రంగ ప్రవేశం చేసి సమస్యను కొలిక్కి తెచ్చారు. కాగా, ఈ విషయమై పీరీలను ఎత్తుకొని వచ్చిన నిమ్మల సాంబయ్య, ఎండీ జాఫర్, కొత్తూరు రమేశ్, కంకనాల శ్యామ్, సమ్ములు, రాజు, రేగుల సది, అనిల్, యాకూబ్, ఓదేలు, దేవి, కుమారస్వామి, భట్టు రాజు, భరత్, రజినీకర్, జాఫర్, రాజయ్య మాట్లాడుతూ జంగాలపల్లి, ఇంచర్ల, వెంకటాపూర్ గ్రామాలకు చెందిన తాము 50 ఏళ్ల నుంచి తమ పూర్వీకుల ద్వారా పీరీలను ఎత్తుకుంటున్నామని, 10 రోజుల ఉపవాసం అనంతరం ఎంతో నియమ నిష్టలతో చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో పీరీలను ఎత్తుకొని ఎస్సీ కాలనీలో తిరుగుతుండగా డీలర్‌గా పనిచేసే ఓ ముస్లిం తమను పీరీలను ఎత్తుకొని తిరగవద్దని అడ్డుకున్నాడని అన్నారు. తాము ఎందుకు అని ప్రశ్నిస్తే మరి కొందరు ముస్లింలను పిలిచి బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. విషయాన్ని చూసిన కాలనీవాసులతో పాటు మాజీ సర్పంచ్ పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. పోలీసులు వచ్చి మందలించి వారిని పంపించారని చెప్పారు.

అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలి

ములుగురూరల్, జూలై 13 : అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గుండెబోయిన రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో అంగన్‌వాడీలు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శనివారం 8వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు రవిగౌడ్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. జీవో నంబర్ 10ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఈ దీక్షలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మక్క, పద్మరాణి, భాగ్య, లక్ష్మి, పద్మరాణి, మోక్షారాణి, అరుందతి, ధనలక్ష్మి, విజయ, రుక్మిణి, సునీత పాల్గొన్నారు.

రోడ్డుపై లారీలు ఉండకుండా చర్యలు తీసుకోవాలి

వెంకటాపురం(నూగూరు), జూలై 13: రోడ్డుకు ఇరువైపులా ఇసుక లారీలను పార్కింగ్ చేసి, ఉంచకుండా చర్యలు తీసుకోవాలని టీఎండీసీ పీవో శ్రీరాములును సీపీఎం నాయకులు శనివారం నిలదీశారు. మండలంలోని పాత్రాపురం గ్రామం నుంచి రోడ్డుకు ఇరువైపులా లారీలను పార్కింగ్ చేసి, ఉంచడం ద్వారా రోడ్డుపై వచ్చే ప్రయాణికులకు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై రాములు మాట్లాడుతూ హెడ్ ఆఫీస్ నుంచి పెద్ద సంఖ్యలో డీడీలు రావడంతో ఈ సమస్య తలెత్తుతుందన్నారు. రేపటి నుంచి నాలుగు రోజుల పాటు లోడింగ్ నిలపివేస్తామన్నారు. మండలంలో లారీలతో ఇబ్బందులు తలెత్తకుండా ర్యాంపులకు అనుగుణంగా అనుమతులిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీరెడ్డి సాంబశివరెడ్డి, గ్యాసం వాసు, కట్ల నర్సింహాచారి, మాణిక్యం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో సెక్యూరిటీ గార్డు మృతి

వెంకటాపూర్, జూలై 13 : మండల కేంద్రంలోని మైనార్టీ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న గాదం సంతోష్ యాదవ్(50) శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందాడు. కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించగా ఏటూరునాగారం గ్రామానికి చెందిన ఒక విద్యార్థిని తన తల్లిదండ్రులు రాలేదని కాలేజీ నుంచి పారిపోతుండగా సంతోష్ ఆమెను పట్టుకోవడానికి పరుగెత్తాడు. తిరిగి వస్తుండగా ఛాతిలో నొప్పి వస్తుందని ప్రిన్సిపాల్‌కు చెప్పడంతో అతడిని 108 ద్వారా ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరిశీలించి, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి స్వస్థలం ములుగు కాగా, అతడికి భార్య రమణి, కూతురు సౌమ్య ఉన్నారు.

'పేదల జోలికొస్తే చూస్తూ ఊరుకోం'

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీరెడ్డిసాంబశివ

వాజేడు, జూలై 13 : గుడిసెలు వేసుకున్న పేదల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీరెడ్డిసాంబశివ అన్నారు. మండలంలోని ఐటీఐ కళాశాల సమీపంలో గుడిసెవాసులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. మండపాక కేంద్రంలో గుడిసెల కోసం పోరాటం ప్రారంభించి, 10 నెలలు పూర్తయిందని ఇప్పుడు కొందురు పార్క్ స్థలం పేరుతో వచ్చి గుడిసెలు కూల్చాలని చూస్తున్నారని ఆరోపించారు. కొందరు గిట్టని వాళ్లు అధికారులపై ఒత్తిడి తెచ్చి, దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి రావు, నాయకులు జెజ్జరి దమోదర్‌రావు, గుగ్గిళ్ల దేవయ్య, బచ్చల కృష్ణబాబు, తోలెం ముత్తయ్య, సౌమ్య, పాయం కుమారి, కృష్ణబాబు, శాంతాకుమారి పాల్గొన్నారు.

బస్సులో సీట్లు ఆపుకునేందుకు గుంపులుగా ఎక్కుతున్న ప్రయాణికులు

బస్సుల కోసం పాట్లు

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు శనివారం ఉదయం బస్సుల రాక కోసం పడరాని పాట్లు పడ్డారు. ఉదయం సుమారు రెండు గంటల పాటు ఎదురు చూసినా బస్సులు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కొంతమంది ప్రైవేట్ వాహనాల్లో వెళ్లిపోగా మరి కొంత మంది తప్పనిసరి పరిస్థితుల్లో బస్సుల కోసం పడిగాపులు కాశారు. చాలా సేపు తర్వాత బస్సు రావడం తో ప్రయాణికులు పరుగులు పెట్టి సీట్లను ఆపుకున్నారు. గుంపులుగుంపులుగా బస్సు ఎక్కుతూ ఇబ్బంది పడుతున్న దృశ్యాలు నమస్తే తెలంగాణ కెమెరాకు చిక్కాయి.

– ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి

టీచర్స్ కాలనీలో అంధకారం

11 గంటలు నిలిచిన విద్యుత్

మంగపేట జూలై 13 : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న టీచర్స్‌కాలనీలోని పలు వీధుల్లో శుక్రవారం రాత్రి 8.55 నుంచి శనివారం ఉదయం 8 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీవాసులు అంధకారంలో నిద్రలేక దోమలతో తీవ్ర ఇబ్బందిపడ్డారు. గతంలో కరెంట్ పోతే కొద్ది సేపట్లోనే పునరుద్ధరించే వారని, ఇప్పుడు తరచూ విద్యుత్ కోతలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మరో వైపు వి ద్యుత్ లైన్లపై చెట్ల తీగలు అలుముకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడడంతో పాటు, విద్యుత్ తీగలపై అలుముకున్న చెట్లను తొలగించాలని కోరుతున్నారు

విద్యుత్‌లైన్‌పై పెరిగిన పిచ్చి చెట్ల తీగలు

అనుమతి ఒక చోట.. నిర్మాణం మరో చోట

ఇష్టారాజ్యంగా పెట్రోల్ బంక్ నిర్మాణం

వెంకటాపూర్, జూలై 13 : పెట్రోల్ బంక్ ఏర్పాటు విషయంలో అనుమతులు ఒక చోట తీసుకొని, మరో చోట దాన్ని ఏర్పాటు చేస్తున్న సంఘటన లింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని లింగాపూర్ గ్రామ పరిధిలో 163 జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు కొంత మంది పనులు చేపట్టారు. అయితే, నిబంధన ప్రకారం లింగాపూర్‌లో గ్రామ సభ నిర్వహించి ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి. కానీ, వెంకటాపూర్ గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకుని అక్కడ కాకుండా లింగాపూర్ గ్రామంలో బంకు నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న లింగాపూర్ గ్రామస్తులు తమ గ్రామం నుంచి అనుమతి తీసుకుని బంకు నిర్మించాలని సదరు యజమానిని కోరారు. అయితే, కొంత మందికి డబ్బులు, విందు ఇచ్చి ఏర్పాటు చేసుకోవాలని యజమాని చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. లింగాపూర్ గ్రామ కార్యదర్శిని పర్మిషన్ కోరినా నిరాకరించారని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా, వెంకటాపూర్‌లో గ్రామ సభ నిర్వహించి, పెట్రోల్ బంక్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఏప్రిల్‌లోనే కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే, ఆ ఉత్తర్వుల్లో లింగాపూర్ బదులుగా వెంకటాపూర్ అని పడిందా? లేక వెంకటాపూర్‌లో అనుమతులు తీసుకొని, లింగాపూర్‌లో వాహనాల రద్దీ ఉంటుందని బంక్ యజమాని ఇక్కడ నిర్మిస్తున్నాడా? అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

గీత కార్మికుడికి ఆర్థిక సాయం

చిట్యాల, జూలై 13 : మండల కేంద్రానికి చెందిన గుర్రపు గట్టయ్య ఏడాది క్రితం వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదశాత్తు మోకు జారీ కింద పడడంతో నడుం విరిగిపోయింది. దవాఖానలో సర్జరీ చేయించినా లాభం లేకుండా పోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మూరుతీ శనివారం బాధితుడి ఇంటికి వెళ్లి గట్టయ్య కుటుంబాన్ని పరామర్శించారు. వారికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాతి పోషన్న, చిట్యాల మండల ఇన్‌చార్జి లొడియ రాజునాయక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వాజేడు, జూలై 13 : మండలంలోని ప్రగళ్లపల్లి పల్లెదవాఖాన పరిధిలోని మొరుమురు, బిజినేపల్లి గ్రామాల్లో శనివారం వైద్యాధికారిణి గ్యానస ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తుల నుంచి రక్తపూతలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరాలున్న వారిని గుర్తించి మందులను అంద జేశారు. ఇంటిటికీ వెళ్లి ఇండ్లలో నీల్వ ఉన్న నీటిని వైద్యసిబ్బంది పారబోశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సీజనల్ వ్యాధుపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు కోటి రెడ్డి, వెంకటరమణ, ఏఎన్ఎం రాజేశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాన్ మసాల కంటైనర్ పట్టివేత

ఏటూరునాగారం, జూలై 13 : పాన్ మసాల, జర్దాబస్తాలతో ఢిల్లీ నుంచి బెంగుళూరుకు వెళ్తున్న కంటైనర్ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక అటవీశాఖ పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో చత్తీస్‌గఢ్ వైపు నుంచి వస్తున్న కంటైనర్‌ను నిలిపి తనిఖీ చేశారు. పాన్ మసాలకు సంబంధించిన బస్తాలు ఉండడంతో స్టేషన్‌కు తరలించారు. కాగా, అందులో 175 బస్తాల్లో పాన్ మసాలా ప్యాకెట్లు, 35 బస్తాల్లో జర్దాప్యాకెట్లు ఉన్నాయని తెలిపారు. కాగా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ద్వారా పట్టుకున్న ప్యాకెట్లు తనిఖీ చేయించగా ప్లెవర్డ్‌తో కూడిన ఉత్పత్తులు మాత్రమే ఉన్నట్లు హాని కలిగించే పదార్థాలు లేనట్లు గుర్తించినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

మంగపేట, జూలై 13 : మండలంలోని చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు యమున మాట్లాడుతూ సీజనల్ వచ్చే వ్యాధులు, వ్యక్తిగత శుభ్రతపై వివరించారు.

రామప్పలో పర్యాటకుల సందడి

పూజలు చేస్తున్న భక్తులు

వెంకటాపూర్, జూలై 13 : మండలంలోని రామప్ప